క్లుప్తంగా

గోశాలకు ఆర్థిక సాయం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు మంగళవారం గుంటూరు జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన చేవూరు చిన్న నాగేశ్వరరావు రూ.20 వేలు విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఉరుములతో కూడిన వర్షం

వత్సవాయి: ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉరుములతో కూడిన వర్షం పడడంతో ఒక్కసారిగా చల్లబడ్డారు. మంగళవారం సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్మి ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు సేదతీరారు.

కంచికచర్ల: అకాల వర్షం కురవటంతో మంగళవారం ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎండ వేడికి తట్టుకోలేక అల్లాడుతున్న సమయంలో ప్రకృతి కరుణించటంతో వాతావరణం చల్లబడింది. అర్ధగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో చల్లని వాతావరణంలో ప్రజలు సేద తీరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పెద్దాపురం(వీరులపాడు): వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్క వాహనదారు, తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న 15 మందికి రూ. 4,500 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మొరాయించిన ఈవీఎంలు

నందిగామ: నందిగామ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ఉదయం సమయంలో బాగా మందకొడిగా సాగింది. అక్కడక్కడా కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి. ఆ తర్వాత సైతం అనేక చోట్ల ఈవీఎంలు నెమ్మదిగా పని చేయడంతో పలుచోట్ల రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపిన సమాచారం ప్రకారం.. నందిగామ నియోజకవర్గంలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 9 గంటల సమయానికి కేవలం 4.46 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఆ తరువాత 11 గంటల సమయానికి 20.55 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 36.19 శాతం, మధ్యాహ్నం 3 గంటల సమయానికి 59.15 శాతం, సాయంత్రం 5 గంటలకు 70.18 శాతం ఓట్లు పోలవగా ఎన్నికలు ముగిసే సమయానికి 87.56 శాతం ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు. ఈసారి ఎన్నికలలో వయసుతో భేదం లేకుండా ప్రతి ఒక్కరూ క్యూ లైన్ లలో ఓటు వేసేందుకు బారులు తీరి కనిపించారు.

జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు మురళీధర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సామాన్య ప్రజల్లో మూఢనమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. కొండపల్లి పట్టణ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ప్రధాన కార్యదర్శి షేక్ సర్దార్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారానికి శ్రీహర్ష ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పీవీకేఎస్ హర్ష ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక అయినట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అయ్యప్ప అరుణాచల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాధరపురానికి చెందిన పోతరాజు వెంకట కాళి శ్రీహర్ష సంస్థ పక్షాన అందిస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని వచ్చే నెల విజయవాడలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం కలిగేలా సంస్థ ప్రతినిధులు విశేష సేవలు అందిస్తున్నారని, అందులో భాగంగా శ్రీహర్షకు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సారీ ఉత్సాహంగానే..

- నియోజకవర్గంలో రికార్డు స్థాయి పోలింగ్ నమోదు
- కొన్ని చోట్ల రాత్రి 11గంటల వరకు కొనసాగిన పోలింగ్
- నియోజకవర్గంలో 87.56 శాతం పోలింగ్ నమోదు



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

నందిగామ: నియోజకవర్గంలో ఈసారి కూడా రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. మహిళా ఓటర్లలో చైతన్యం అధికంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు 16 సార్లు (ఒక పర్యాయం జరిగిన ఉప ఎన్నికతో కలిపి)ఎన్నికలు జరగ్గా 2019లో మాదిరిగానే ఈసారి కూడా ఓటర్లు భారీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాత్రి 11 గంటల వరకు కొనసాగిన పోలింగ్..

నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లలో రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ కొనసాగింది. ముఖ్యంగా నందిగామ మండలంలోని పెద్దవరం, చందర్లపాడు మండలంలోని కొడవటికల్లు, వీరులపాడు మండలంలోని గూడెం మాధవరం, కంచికచర్లలోని సత్రం బడి లోని పోలింగ్ స్టేషన్లలో దాదాపు రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగుతూనే ఉంది. అయితే, అంత సేపు పోలింగ్ జరిగినా, ఆయా పోలింగ్ బూత్‌లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడం విశేషం. ఓటర్లు ఎంతో ఓపిగ్గా, సంయమనం పాటించి ఓట్లు వేశారు.

రికార్డు స్థాయి పోలింగ్ శాతం నమోదు..

నందిగామ నియోజకవర్గంలో ఈ సారి కూడా రికార్డు స్థాయి పోలింగ్ శాతం నమోదైంది. 2004 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 2019లో మాదిరిగానే ఈసారి కూడా ఓటర్లు భారీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే 2004 నుంచి ఓటర్లలో అంతకంతకు చైతన్యం పెరుగుతూ వస్తోంది. అందుకు అనుగుణంగానే పోలింగ్ శాతం కూడా పెరుగుతోంది. 2004లో 80.18 శాతం పోలింగ్ నమోదు కాగా, 2009లో 81.67 శాతం, 2014లో 84.29 శాతం నమోదు కాగా, 2019 లో 87.73 శాతం పోలింగ్ మోదు కాగా ఈసారి కూడా కాస్త తక్కువగా అదేవిధంగా 2019 తరహాలోని 87.56 శాతం పోలింగ్ నమోదయింది. ఓటు పట్ల ప్రజలకు పెరుగుతన్న అవగాహన, బాధ్యతకు ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

గెలుపుపై ధీమా ..

గత ఎన్నికలలో మాదిరిగానే ఈసారి కూడా నియోజకవర్గంలో ఓటింగ్ శాతం భారీగా పెరగడం ప్రధాన పార్టీ అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తోంది. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత 30 సంవత్సరాలలో నియోజకవర్గంలో జరగని ఎన్నో అభివృద్ధి పనులు కేవలం ఐదు సంవత్సరాలలో అధికార పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు చేసి చూపించారు. ప్రభుత్వ పథకాలు ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును వినియోగించుకున్న నేపథ్యంలో నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తామే గెలుస్తామని టీడీపీ వర్గాలు ఆశలు పెంచుకోవడం విశేషం.

నియోజకవర్గంలో పోలింగ్ సరళి ఇలా..

నియోజకవర్గంలో	
మొత్తం పోలింగ్ బూత్‌లు	: 222
మొత్తం ఓటర్ల సంఖ్య	: 2,05,480
పురుషులు	: 99,398
మహిళలు	: 1,06,076
థర్డ్ జెండర్	: 06
ఓటు హక్కు వినియోగించుకున్న	
మొత్తం ఓటర్లు	: 1,79,915
పురుషులు	: 87,768
మహిళలు	: 92,143
థర్డ్ జెండర్	: 04
నియోజకవర్గంలో పోలింగ్ శాతం	: 87.56

90 శాతం దాటిన పోలింగ్



అనిగండ్లపాడులో అర్ధరాత్రి వరకు క్యూలో నిలబడిన ఓటర్లు

నందిగామ: సార్వత్రిక ఎన్నికలలో ఈసారి కూడా ఓటర్లలో చైతన్యం కనిపించింది. స్థానికులతో పాటు పొరుగు రాష్ట్రాలలో ఉండేవారు సైతం సొంత గ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో ఆయా మండలాల్లో సోమవారం జరిగిన ఎన్నికలలో నందిగామ మండల పరిధిలో ఎక్కువ శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నందిగామ పట్టణంతో పాటు మండలాల వారీగా పోలింగ్ శాతం వివరాలు..

నందిగామ పట్టణం..

నందిగామ పట్టణ పరిధిలో మొత్తం 36,492 మంది ఓటర్లు ఉండగా వారిలో 29,092(79.72) శాతం మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందిగామ మండల పరిధిలో మొత్తం 23,489 మంది ఓటర్లు ఉండగా వారిలో 21,420 (91.19) నియోజకవర్గంలో అత్యధిక శాతం మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చందర్లపాడు మండలంలో మొత్తం 49,019 మంది ఓటర్లు ఉండగా వారిలో 43,669 (89.08) శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కంచికచర్ల మండలంలో మొత్తం 56,066 మంది ఓటర్లు ఉండగా 49,488 (88.27) శాతం మంది ఓటు వేశారు. వీరులపాడు మండలంలో 40,414 మంది ఓటర్లు ఉండగా 36,247 (89.69) శాతం మంది ఓట్లు వేశారు. మొత్తం మీద నియోజకవర్గంలో 2,05,480 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,79,915 (87.56) శాత మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలింగ్

పెనుగంచిప్రోలు: 2024 సార్వత్రిక ఎన్నికలను ఓటర్లు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అర్ధరాత్రి అయినా ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, కవ్వింపు చర్యలు చేపట్టినా ఎవరూ పట్టించుకోకుండా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీల్లోని 47 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ పలు కేంద్రాల్లో నమోదైంది.

ఈవీఎంల మొరాయింపుతో ఆలస్యం..

మండలంలో ఈవీఎంల మొరాయింపు, సిబ్బందికి అవగాహన లేక పోవటం, తదితర కారణాల వలన పలు గ్రామాల్లో పోలింగ్ ఆలస్యమైంది. అనిగండ్లపాడు 162 పోలింగ్ కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి 2 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నాలుగైదు గంటల పాటు ఈవీఎంలు పనిచేయక పోవటం, పలు కారణాలతో ఓటింగ్ ఆలస్యమైంది. ఇక్కడ వీఆర్‌ఏ పొందూరి నగేష్ టీడీపీ వారికి అనుకూలంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ వారు ఆందోళన చేశారు. బీఎల్‌ఓగా నూతన ఓటర్లు చేర్పించే విషయం నాటి నుంచి ఎన్నికల వరకు టీడీపీకి ప్రతి విషయంలో అనుకూలంగా వ్యవహరించారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శనగపాడులో 194, 195 పోలింగ్ కేంద్రంలో అర్ధరాత్రి 12 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పెనుగంచిప్రోలు 177, 178, 179, 180, 181 పోలింగ్ కేంద్రాల్లో కూడా ఓటింగ్ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. కొణకంచిలో కూడా ఈవీఎంల మొరాయింపుతో ఓటింగ్ ఆలస్యమైంది. మొత్తం మీద వృద్ధులు, మహిళలతో పాటు యువత కూడా పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఓటర్లలో వెల్లివిరిసిన చైతన్యం

- నియోజకవర్గంలో 89.88 శాతం పోలింగ్ నమోదు
- జిల్లాలోనే జగ్గయ్యపేట ప్రథమ స్థానం



జగ్గయ్యపేట ఆర్‌సీఎం పాఠశాలలో సోమవారం రాత్రి క్యూలో మహిళలు (ఫైల్)

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో మహిళలు అత్యంత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రినక ఎన్నికల్లో 89.88 శాతం ఓటింగ్ నమోదైనట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వర్లు మంగళవారం పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 222 బూత్‌లలో పోలింగ్ గణనీయంగా పెరిగిందన్నారు. 2,05364 మంది ఓటర్లకు గాను 1,84,575 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 88,667 మహిళలు 95,904, ఇతరులు నలుగురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో 89.64 శాతం పోలింగ్ నమోదు కాగా 2024లో 89.88 శాతం నమోదైందన్నారు. గతం కంటే ఇప్పుడు 0.24 శాతం పెరిగింది. జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామంలోని 84వ బూత్‌లో అత్యధికంగా 97.53 శాతం, తిరుమలగిరిలోని 72వ బూత్‌లో 96.83 శాతం, పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయిగూడెంలోని 200వ బూత్‌లో 96.36 శాతం పోలింగ్ నమోదు కాగా, జగ్గయ్యపేట పట్టణంలోని పులిచింతల ప్రాజెక్ట్‌లోని ఎన్‌ఎస్పీ క్వార్టర్స్ 45వ బూత్‌లో 75.63 శాతం తక్కువగా పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.

మండలాల వారీగా పోలింగ్ శాతం..

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ ఏటిపట్టు గ్రామాలతో పాటు జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట మున్సిపాలిటీలోని 31వ వార్డుల్లో 85.51 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీలో మొత్తం ఓటర్లు 41,082 మంది ఓటర్లు ఉండగా 35,129 ఓట్లు పోల్ అయ్యాయి. వీరిలో పురుషులు 16,598 మంది, స్త్రీలు 18,531 మంది ఉన్నారు. జగ్గయ్యపేట మండలంలో 91.16 శాతం పోలింగ్ నమోదు కాగా మొత్తం ఓటర్లు 57,029 మంది ఉండగా 51,988 ఓట్లు పోల్ అయ్యాయి. వీరిలో పురుషులు 25,241 మంది, స్త్రీలు 26,714 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వత్సవాయి మండలంలో 90.18 శాతం పోలింగ్ నమోదు కాగా మొత్తం ఓటర్లు 50,017 మంది ఓటర్లకు 45,105 ఓట్లు పోల్ అయ్యాయి. వీరిలో పురుషులు 21,586 మంది, స్త్రీలు 23,519 మంది ఓట్లు వేశారు. పెనుగంచిప్రోలు మండలంలో 90.80 శాతం పోలింగ్ నమోదు కాగా మొత్తం ఓటర్లు 41,815 ఉండగా 35,967 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషులు 18,277 మంది, స్త్రీలు 19,969 మంది ఓట్లు వేశారు. నందిగామ ఏటిపట్టు గ్రామాల్లో 93.29 శాతం పోలింగ్ నమోదు కాగా మొత్తం ఓటర్లు 15,421 ఉండగా 14,386 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషులు 6,965 మంది, స్త్రీలు 7,421 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఎక్కువగా మహిళలే ఓట్లు వేసేందుకు తరలి వచ్చారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు



స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు తరలించేందుకు సిద్ధం చేసిన వాహనం వద్ద అధికారులు

నందిగామ: పటిష్ట భద్రత నడుమ ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిమాచమని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి అన్నారు. నందిగామ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను మంగళవారం పోలీసు బందోబస్తు నడుమ ఇబ్రహీంపట్నం సమీపంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. అక్కడ అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. అనంతరం నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నరేందర్ సింగ్ బాలి సమక్షంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ. రవీంద్రరావు స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ మాట్లాడుతూ ఈవీఎంలు కట్టుదిట్టమైన భద్రత, నిఘా కెమెరాల పర్యవేక్షణలో భద్రపరిచినట్లు తెలిపారు. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05,480 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,79,915 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.రవీంద్రరావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

జగ్గయ్యపేట: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం 222 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. అయితే రాత్రి 11గంటల వరకు పోలింగ్ జరగడంతో ఈవీఎంలు సెక్టార్ల వారీగా తెల్లవారుజామున నాలుగు గంటలకు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి చేరుకున్నాయి. మంగళవారం ఉదయం 11గంటల వరకు ఆర్వో వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అసెంబ్లీ, పార్లమెంట్ వారీగా ఈవీఎంలను వేరు చేసి ప్రత్యేక వాహనంలో భారీ బందోబస్తు నడుమ ఇబ్రహీంపట్నం నోవా ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో శేషగిరి, నందిగామ ఏసీపీ రవికిరణ్, డీటీ నాగరాజు, చిల్లకల్లు, జగ్గయ్యపేట ఎస్‌ఐలు సతీష్, సూర్యభగవాన్‌లు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు

కక్షిదారులు రాజీ పడేలా చేయండి

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు రాజీ పడేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి అన్నారు. రాజీ పడటం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో జగ్గయ్యపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జగ్గయ్యపేట కోర్టుల పరిధిలో ఉన్న కేసుల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం వ్యవహరించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రావణి మాట్లాడుతూ రాజీ పడేందుకు లోక్ అదాలత్‌ల ద్వారా అవకాశం ఉందని, ఇరు పార్టీలు రాజీ పడాలంటే ముఖ్యంగా న్యాయవాదుల మధ్యవర్తిత్వం అవసరం అన్నారు. అలాగే అదనపు జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని, తద్వారా పెండింగ్ కేసులు పరిష్కారం కావడంతో పాటు ఏళ్ల తరబడి కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగడం, డబ్బు వృథా చేసుకోవడం తప్పుతుందన్నారు. ఆ దిశగా న్యాయవాదులు కక్షిదారులను ఎడ్యుకేట్ చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రావణి, పక్కన జడ్జి శోభారాణి, బార్ అధ్యక్షుడు సుందరరావు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బి.వెంకట్రామయ్య, పి.సత్యశ్రీనివాసరావు, ఎస్.నరసింహారెడ్డి, జె.శ్రీనివాసరావు, ఏజీపీ టీఎల్.నరసింహారావు పాల్గొని న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆంజనేయులు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



ముసునూరు: ముసునూరులో భగీరథ జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక సగర సంఘం ఆధ్వర్యంలో సగర వంశ మూల పురుషుడు భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక సగర సంఘ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

ఆహ్లాదం..ఆరోగ్యం



కృష్ణమ్మ జల విహారం పార్కులో సందర్శకుల సందడి

పార్కులకు సందర్శకుల తాకిడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్నికల వేడి చల్లారింది. పోలింగ్ ముగిసింది. కౌంటింగ్‌కు మరో 20 రోజుల సమయం ఉంది. పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు కూడా ఇచ్చారు. దీంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని ప్రదేశాల్లో గడిపేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా, నగరంలోనే నందనవనం లాంటి పార్కు అందుబాటులోకి వచ్చింది. కృష్ణానదీ తీరాన ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. దాంతో పాటు నగరంలో రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు, పలు కాలనీలలో ఏర్పాటు చేసిన, అభివృద్ధి చేసిన పార్కులు అందుబాటులో ఉన్నాయి.

పరుచుకున్న పచ్చదనం

ప్రకృతి వడిలో సేదతీరేందుకు ఇంటి సమీపంలోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా నగర పాలక సంస్థ అరుదైన మొక్కలను అక్కడ ఏర్పాటు చేసింది. పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వాటిని సందర్శించి మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. నగరంలోని ప్రధాన పార్కులైన రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కుతో పాటు, పలు కాలనీల్లోనూ పార్కులు ఏర్పాటు చేశారు.

ఇంటి సమీపంలోనే...

వాకింగ్ చేయాలంటే ఒకప్పుడు దూర ప్రాంతంలోని గ్రౌండ్‌కు వెళ్లాల్సి రావడంతో మహిళలు వాకింగ్‌పై ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు తాము నివసిస్తున్న కాలనీల్లోనే పార్కులు ఏర్పాటు చేయడం, వాటిలో వాకింగ్ ట్రాక్‌లు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకింగ్ చేసేందుకు మహిళలే ఎక్కువగా వస్తున్నారు. పిల్లలకు ఆట పరికరాలను ఏర్పాటు చేయడంతో కొందరు మహిళల తమ పిల్లలను తీసుకుని పార్కుకు వచ్చి, వాళ్లు ఆడుకుంటుంటే, తల్లులు వాకింగ్ చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా...



పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

నగర జీవికి శారీరక శ్రమ లేకపోవడంతో ఎక్కువగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే దూర ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి సమీపంలో తమ కాలనీల్లోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భార్యభర్తలతో పాటు, తమ పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మరోవైపు వృద్ధులు సైతం మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.

మానసికంగా చాలా ఉపయోగం



బిజీ లైఫ్ నుంచి బయటపడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పచ్చని మొక్కల మధ్య వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. వృద్ధుల్లో జ్ఞాపకశక్తి తగ్గకుండా దోహదపడుతుంది. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. దీంతో ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ విడుదల అవుతుంది. తద్వారా మానసిక వత్తిళ్లు తగ్గుతాయి.

–డాక్టర్ గర్రే శంకరరావు, మానసిక విశ్లేషకులు

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి పి.భరత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న భరత్‌కుమార్ ఈ ఖ్యాతిని సాధించి తమ కళాశాల కీర్తిని, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేశాడన్నారు. నగరానికి తిరిగి వచ్చిన భరత్‌కుమార్‌కు రైల్వే స్టేషన్ వద్ద కళాశాల తరఫున ఘనంగా స్వాగతం పలికి అక్కడి నుంచి కళాశాల విద్యార్థులు భారీ ప్రదర్శనగా తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో భరత్‌కుమార్‌ను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు సత్కరించి స్వాగతం పలికారు. భరత్‌కుమార్‌తో పాటు అతడిని తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.